
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## కాంగ్రెస్ నేతల బెదిరింపులపై డిజిపికి ఫిర్యాదు

**వికారాబాద్, ప్రభాతవార్త :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావును బుధవారం వికారాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కలిశారు. వికారాబాద్ అసెంబ్లీ పరిధిలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్ర నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటో కాల్ ప్రకారం ప్రాధాన్యత కల్పించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై అసెంబ్లీ స్పీకర్‌ను ప్రశ్నించిన ఘట నలో బీజేపీ సర్పంచ్ బీర్ల రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అక్రమ కేసు నమోదు చేయడంతో పాటు పార్టీ నాయకులు, సర్పంచ్‌లను పోలీసులు బెదిరిస్తున్నారని రాం చందర్‌రావు దృషికి తీసుకెళ్ళారు. దీనిపై స్పంధించిన రాంచందర్‌రావు త్వరలోనే డీజీపిని కలిసి ఫిర్యాదు చేస్తానని స్థానిక నాయకులకు హామీ ఇచ్చారు.



వికారాబాద్ నేతల ఫిర్యాదును పరిశీలిస్తున్న రాంచందర్‌రావు



వికారాబాద్‌లో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

## నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** నిరుపేదలైన అర్హులందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, నివాసమే ఏర్పాటు చేసుకొని ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ పార్టీ వికారాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్షి ్మ పండిత్ మాట్లాడుతూ, భూ సమస్యలు పరిష్కరిం చాలని, పరిగి మండలం మిట్ట కోడూరు గ్రామంలో >>2



బాలుర వసతి గృహంలో వంటలు పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

# మెనూ మైనస్..

**★చిట్యాల జడ్పీ హైస్కూల్ సిబ్బంది నిరక్ష్యం ★పిఎం పోషణ్ పథకం అమలులో నిబంధనల ఉల్లంఘన ★ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సీరియస్ ★హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు**

**పరిగి, జూలై 1, ప్రభాతవార్త :** గురుకులాలు, పాఠశాలల్లో నిర్ణయించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాన్ని అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. బుధవారం పరిగి మండల పర్యటనలో భాగంగా పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల, తుంకులగడ్డలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి, విద్యార్థులకు అంధిస్తున్న మెనూ, భోజన వసతులపై ఆరా తీసారు. తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు ఛేపట్టాలని అధికారులను ఆదేశించారు.. పాటించని అధికారులపై చర్యలు తప్పవన్నారు. చిట్యాల జడ్పిహెచ్ ఎస్‌లో పిఎం పోషణ్ (మద్యాహ్న భోజనం) పథకంలో మెనూను పాటించడం లేదని, ప్రభుత్వం ఆమోదించిన విధంగా విద్యార్థులకు భోజనం అందించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ ధీపక్ తివారి, మెనూ పాటించక పోవడానికి గల కారణాలను వివరిస్తూ ఒక రోజులో సమగ్ర వివరణ ఇవ్వాలని పాఠశాల ప్రదానోపాధ్యాయులకు ఆదేశించారు.

చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మిక తనిఖీ చేసి, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేలా వైద్యులు చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సిబ్బంది హాజరు పట్టిక, ఇన్ పేషెంట్ వార్డు, స్త్రీల వార్డు గదులను పరిశీలించారు.

**ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కుదరదు**

అనంతరం పరిగి లోని ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని సందర్శించి, నిర్ణయించిన ధరల ప్రకారమే ఎరువులను విక్రయించాలని సూచించారు.. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచాలని అధికారులకు సూచించారు.. అనంతరం, ఎస్ఆర్ఐ ప్రక్రియలో భాగంగా పరిగి కేంద్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు వహించాలని బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు.. ఓటరు జాబితాలో ఏవైనా మార్పులుంటే ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి సరి చేయాలని కలెక్టర్ తెలిపారు. బిఎల్ఓలు తప్పనిసరిగా గుర్తింపు కార్డు, టోపీ కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ పర్యటనలో ఆర్డిఓ వాసు చంద్ర, తహసిల్దార్ వెంకటలక్షి ్మ, ఎంపీడీఓ హరి ప్రియా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, చైర్ పర్సన్ రజిత, డిఎంహెచ్ఓ పి. రాంబాబు, డిఎస్సిడబ్ల్యూఓ జయపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నచ్చినోళ్లకే కాంట్రాక్టులు

## మూసీ డీసిల్టింగ్ పనులలో పారదర్శకత శూన్యం

**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త:**

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న మూసీ నదిని శుభ్రం చేయాలనే లక్ష ్యంతో ప్రభుత్వం భారీ స్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపడుతోంది. వర్షాకాలంలో వరద ముప్పు తగ్గించేందుకు కోట్ల రూపాయలతో పనులు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ అదే పనులకు సంబంధించిన టెండర్లలో మాత్రం పారద ర్శకత కనిపించడం లేదని కాంట్రా క్టర్లు ఆరోపిస్తున్నారు. జీహెచ్ ఎంసీ ఇంజనీరింగ్ అధికారులే తమకు నచ్చిన సంస్థలకు అనుకూ లంగా టెండర్ నిబంధనలు రూపొందిస్తున్నారని విమర్శిస్తున్నా రు. నిబంధనలను కావాలనే కఠినతరం చేసి, కొందరు మాత్రమే అర్హత సాధించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కార్వాన్ సర్కిల్‌లో తాజాగా విడుదల చేసిన టెండర్ చుట్టూ వివా దం రాజుకుంది. 26 శాతం లెస్ కోట్ చేసిన వారిని పక్కనబెట్టి 2 శాతం కోట్ చేసిన సంస్థకు ఎలా టెండర్ దక్కిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. గోల్కొండ జోన్ లోని కార్వాన్ సర్కి ల్ పరిధిలో పురానాపూల్ బ్రిడ్జి నుంచి అత్తాపూ ర్ బ్రిడ్జి వరకు మూసీ డీసిల్టింగ్ పనులకు ఇటీవల టెండర్ విడుదలైంది. అయితే ఈ టెండర్‌లో ఇతర సర్కిళ్లలో ఎక్కడా లేని విధంగా ఈఎస్ఐ, ఈపీఎఫ్ తప్పనిసరి అనే నిబంధన చేర్చడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పూర్తిగా యంత్రాలతో, ముఖ్యంగా హిటాచీ వంటి యంత్రాలతో చేసే పని అయినప్పుడు ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిబంధనలు ఎందుకు పెట్టారని ఇతర కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. మ్యాన్‌పవర్ ఆధారిత పనులకు మాత్రమే వర్తించే షరతులను యంత్రాలతో చేసే పనులకు వర్తింపజేయడం వెనుక ఉద్దేశం ఏమి టని నిలదీస్తున్నారు. ఈ నిబంధనల వల్ల ముందే నిర్ణయించుకున్న సంస్థకు టెండర్ వచ్చేలా చేశారని ఆరోపిస్తున్నారు.

కార్వాన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై కాంట్రాక్టర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. >>2

## డిప్యూటేషన్లపై


# రోజుకో డాక్టర్

### రోగుల ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోవడంలో విఫలం

- రాత్రి పూటా అందుబాటులో ఉండని వైద్యులు
- కేవలం నర్సులు మాత్రమే వైద్య సేవలు
- కనీస వసతులు, సౌకర్యాలూ లేవు
- నామమాత్రంగా మారిన సామాజిక ఆరోగ్య కేంద్రం
- ముప్పై పడకల ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసినా ఫలితం శూన్యం
- శాశ్వత ప్రాతిపదికన వైద్యుల నియామకం ఉండాలని స్థానిక ప్రముఖుల డిమాండ్

**శామీర్‌పేట, జులై 1, ప్రభాతవార్త:** శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముప్పై పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చి, వైద్య విధాన పరిషత్‌లోకి అప్‌గ్రేడ్ చేసినప్పుడు స్థానిక ప్రజలు ఎంతో సంతోషించారు. ఇకపై తమకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశపడ్డారు. కానీ, ఆ ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వం ఆసుపత్రి భవనాన్ని అప్‌గ్రేడ్ చేసింది కానీ, అందుకు తగ్గట్టుగా ఎంతమంది డాక్టర్లు ఉండాలి, ఎంతమంది నర్సులు ఉండాలనే నిర్దిష్టమైన సిబ్బంది సంఖ్యను మాత్రం ఖరారు చేయలేదు. ఫలితంగా, ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన వైద్యుల నియామకం జరగలేదు. నిత్యం సుమారు రెండు వందల మందికి పైగా ఓపి రోగులు ఈ ఆరోగ్య కేంద్రానికి వస్తుండగా, వారికి సేవలు అందించడానికి డిప్యూటేషన్ల మీద రోజుకో కొత్త డాక్టర్ వచ్చి వెళ్తున్నారు. ఇలా రోజుకో వైద్యుడు మారుతుండటంతో, రోగుల ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకుని చికిత్స అందించే నాథుడే కరువయ్యాడు. కనీసం రాత్రి పూట కూడా ఒక్క డాక్టర్ అందుబాటులో ఉండటం లేదు.

కేవలం నర్సులు మాత్రమే >>2



ఆరోగ్యకేంద్రంలో సమస్యలపై డాక్టర్ తన్మయిని అడిగి తెలుసుకుంటున్న సిపిఎం కార్యదర్శి సత్యం తదితరులు

కాకరవేణిలో

# ఇసుక తుఫాన్



కాకరవేణి నదీపరీవాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాల దృశ్యం

- శ్రీవారి ఆలయ పునర్నిర్మాణ పనుల అవసరాల కోసం పర్మిట్లు
- మూడు రోజుల పాటు తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్
- అదీ మూడు క్యూబిక్ మీటర్లకే..
- క్షేత్రస్థాయిలో భారీ ఎత్తున మొహరించిన జెసిబిలు
- రణగొణ ధ్వనులతో దద్దరిల్లిపోతున్న నదీతీరం
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని విపక్షాల ఆరోపణలు
- అధికారుల మౌనంపై అనుమానాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కాకరవేణిలో "ఇసుక తుఫాన్" చెలరేగింది. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ వద్ద కాకరవేణి నదీ పరివాహక ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లిపోయింది. ఇరవై ఏళ్లుగా అర్థంతరంగా ఆగిపోయిన శివసాగర్ ప్రాజెక్టు సమీపంలో జెసిబిలు, భారీ టిప్పర్లు, ట్రాక్టర్ల రణగొణ ధ్వనులు మోగాయి. కొడంగల్ పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, సుమారు రూ.110 కోట్ల భారీ వ్యయంతో తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీ లక్షీ ్మ వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. పీవీఆర్ నిర్మాణ సంస్థ ఈ పనులను దక్కించుకోగా, ఆలయ నిర్మాణ అవసరాల కోసం ఇసుక రవాణాకు కాంట్రాక్టర్ అనుమతులు (పర్మిట్లు) పొందారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ సూచనల మేరకు రెవెన్యూ అధికారులు కాకరవేణి నదిలో మూడు రోజుల పాటు ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, ఇక్కడే అసలు కథ మొదలైంది! అధికారికంగా రెవెన్యూ శాఖ ఇచ్చిన అనుమతి కేవలం మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు మాత్రమే. కానీ, క్షేత్రస్థాయిలో సీన్ చూస్తే.. రెవెన్యూ శాఖ నుంచి అనుమతి పత్రాలు చేతికి రాకముందే నదిలోకి భారీ యంత్ర సామగ్రి దిగిపోయింది. స్థానికుల చేతుల్లో ఈ యంత్రాల నిర్వహణ బాధ్యతలు పెట్టి, పెద్ద ఎత్తున ఇసుకను తరలించేందుకు వాహనాలు బారులు తీరాయి. కేవలం మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక కోసం ఇంత భారీ ఎత్తున జెసిబిలు, నదిని గుల్ల చేసే యంత్రాలు ఎందుకు వచ్చాయంటూ ప్రతిపక్షాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై యాలాల మండల బిఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోరుబాట పట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక పర్మిట్లు ఇవ్వడం వెనుక అధికారుల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బిఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆరోపించారు. "కొద్ది రోజులుగా స్థానిక రెవెన్యూ వర్గాల తీరుపై, ఈ అక్రమ లీలలపై తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా, వారు కనీసం పట్టించుకోకపోవడం వెనుక ఉన్న మర్మమేంటి?" అని ఆయన వాపోయారు.

## కళాశాలకు వెళ్లటానికి నిరీక్షిస్తున్న విద్యార్థి మృత్యువాత

### కారును తప్పించబోయి..కాలయముడిలా దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు!

3లో

# కబ్జాకోరులపై క్రిమినల్ కేసులు

**•ప్రభుత్వ భూములను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు •స్థలాలు కొనేముందు జర జాగ్రత్త! •అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం •అధికారుల వార్నింగ్**

**జవహర్‌నగర్, జూలై 1, ప్రభాతవార్త:** కాప్రా మండల పరిధిలోని జవహర్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. సర్వే నంబర్లు 812, 316లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతు న్నాయనే సమాచారంతో కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. గిర్దావర్ సత్యనారాయణ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో వికలాంగుల కాలనీలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఒక గదిని, అలాగే చెన్నాపూర్ ప్రధాన చౌరస్తా వద్ద అక్రమంగా నిర్మించిన షట్టర్‌ను తొలగించారు. అధికారులు ముందస్తు పరిశీలన అనంతరం ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షి ంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అమాయక ప్రజలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలి పారు. అటువంటి అక్రమార్కుల వివరాలను సేకరిస్తున్నామని, త్వరలోనే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభు త్వ భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భూములు కొనుగోలు చేసే ముందు సంబంధిత రెవెన్యూ అధికారుల వద్ద పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, అలాంటి వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరు ద్ధంగా నిర్మాణాలు చేపడితే వెంటనే కూల్చివేత చర్యలు చేపడతామని తహసీల్దార్ మతిన్ హెచ్చరించారు.



జవహర్‌నగర్ ప్రభుత్వ భూములలో నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం



# ఈ నెలంతా పోలీస్ ఆంక్షలు

**♦ఐదుగురికి పైగా ఒకేచోట ఉండకూడదు ♦ధర్నాలు, ర్యాలీలు, సభలకు అనుమతులు తప్పనిసరి ♦డిజెలు పూర్తి నిషేధం ♦ఎస్పీ స్నేహామెహ్రా వెల్లడి**

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలపై ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఐదుగురికి పైగా గుమికూడరాదని, నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై పూర్తి నిషేధం ఉంటుందని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**బాలల సంరక్షణే ఆపరేషన్ ముస్కాన్ ధ్యేయం**

బాలల సంరక్షణే ఆపరేషన్ ముస్కాన్ ధ్యేయమని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రారంభం రోజునే ఐదేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ, బాలుడిని వికారాబాద్ పోలీసులు సురక్షితంగా తీసుకువచ్చారు. జూలై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ ఆపరేషన్ ప్రారంభం రోజే వికారాబాద్ పోలీసులు పట్టుదలతో శ్రమించి, సరిహద్దులు దాటి మరీ ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఒక క్లిష్టమైన ఖిమహిళ, బాలుడి మిస్సింగ్ కేసును ఛేదించి ముస్కాన్ కార్యక్రమానికి అత్యుత్తమ ఆరంభాన్ని ఇచ్చారని తెలిపారు. 2020 సంవత్సరంలో నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ, చిన్నారి బాలుడు అదృశ్యమయ్యారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో ఈ కేసు లాంగ్ పెండింగ్ కేసుగా మిగిలిపోయిందని పేర్కొన్నారు. నవాబ్‌పేట్ పోలీసులు అత్యాధునిక సాంకేతిక ఆధారాలను (కాల్ డేటా, ఆధార్ లింక్‌లు) క్షుణ్ణంగా విశ్లేషించి. లభించిన ఆధారాలతో వికారాబాద్ డిఎస్పి అంజయ్య పర్యవేక్షణలో మోమిన్‌పేట్ సిఐ, జి. వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి ల యొక్క సూచనల మేరకు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం ఆంధ్రప్రదేశ్‌లోని మునగపాక పోలీస్ స్టేషన్ పరిధికి చేరుకుని, సుదీర్ఘ గాలింపు చర్యల అనంతరం ఆ మహిళను, బాలుడిని సురక్షి తంగా స్వాధీనం చేసుకున్నారు. టెక్నాలజీని వాడుకుని చాకచక్యంగా ఈ కేసును ఛేదించిన మోమిన్‌పేట్ సిఐ జి.వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి, సిబ్బంది సాయి కుమార్, మహేందర్ గౌడ్‌లను ఎస్పీ అభినందించారు. మహిళలు, పిల్లల భద్రత విషయంలో వికారాబాద్ పోలీస్ శాఖ ఎప్పుడూ రాజీ పడదని. ఈ రోజు నుండి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా తప్పిపోయిన, భిక్షాటన చేస్తున్న బాల కార్మికులుగా మారిన పిల్లలను రక్షి ంచి వారి కుటుంబాలకు అప్పగించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ల వారీగా పోలీస్ అధికారులు సంబంధిత అధికారులతో కలసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి వికారాబాద్ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా మార్చాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## రవాణా కష్టాలకు ఇక..

# చెల్లుచీటీ

- రూ.251.20 కోట్లతో గ్రామీణ రహదారులకు మహర్దశ
- ఫేజ్-I కింద 15 పనులకు ఆమోదం
- పరిగి, దోమ, మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయాల భవనాలకు రూ.6.75 కోట్లు

**పరిగి, జులై 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ ద్వారా పరిగి నియోజక వర్గంలో భారీగా రహదారులు, కార్యాలయాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పరిగి నియోజకవర్గంలో పరిగి, దోమ, మహమ్మదాబాద్ మండలాల నూతన ఎమ్మార్వో భవనాల నిర్మాణానికి రూ. 2.25 కోట్ల చొప్పున 6.75 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బుధవారం పరిగిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రజల ప్రయాణ సౌకర్యాలను మెరుగు పరచి, గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యమని తెలిపారు. పంచా యతీ రాజ్ శాఖ ఫేజ్-I కింద 15 గ్రామీణ రహదారులకు ఆమోదం తెలిపిందని, పంచా యతీ రాజ్ ఇంజినీరింగ్ >>2

## దోమల నివారణకు పకడ్బందీ చర్యలు

**హైదరాబాద్, జూలై 1 ప్రభాతవార్త:**

అనువైన చోట్ల మొక్కలు నాటే లా చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మన్సూరా బాద్ సహారా ఎస్టేట్స్, కుం ట్లూర్, హయత్ నగర్ ఖా ల్సా, నాగోల్ బండ్లగూడ రోడ్డులో అధికారులు, సిబ్బం దితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్‌లో వెక్టర్ కంట్రోల్ డ్రైవ్‌లో భాగంగా దోమల లార్వా వ్యాప్తి చెందే ప్రాంతాలను పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్ పరిసరాల్లో నిల్వ ఉన్న నీరు దోమల ఉత్పత్తికి అనుకూలంగా మారే అవకాశం ఉందని గుర్తించిన కమిషనర్, సంబంధిత అధికారులు, సొసైటీ ప్రతినిధులకు వెంటనే నిల్వ నీటిని తొలగించి, స్విమ్మింగ్ పూల్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే దోమల నివారణకు అవసరమైన యాంటీ లార్వా చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటిస్తూ వెక్టర్ కంట్రోల్ కార్యక్రమాలకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. హయత్‌నగర్ ఖాల్సాలోని ఆర్టీసీ కాలనీ ప్రధాన రహదారిపై జీవీపీను తనిఖీ చేసి చెత్త తరలింపు ప్రక్రియపై రామ్‌కీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎటు వంటి ఆలస్యం లేకుండా చెత్తను తరలించాలని ఆదేశించారు. జీవీపీలు పూర్తిగా తొలగేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సకాలంలో చెత్తను తొలగిస్తూ పారిశుద్ధ్య చర్యలను మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు. కుంట్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీసీ, డీఈ, ఏఈ, యూబీడీ అధికారులు, రామ్‌కీ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించిన కమిషనర్, వెంటనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యే క దృష్టి సారించి, వాటి ఆరోగ్యక రమైన ఎదుగుదల, దీర్ఘకాల మనుగడకు అవసరమైన నిర్వహణ చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. వీటితో పాటు నాగోల్‌లోని బండ్లగూడ రోడ్డులో ఉన్న ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంను పరిశీలించారు.

## వీధి కుక్కల దాడిలో 18 మేకలు మృతి

3లో



## కొత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా సాహితీరెడ్డి

3లో

## అమ్మకానికి కుళ్లిన చేపలు, రొయ్యలు! రసాయనాలతో నిల్వ ఉంచిన నలుగురు వ్యాపారుల అరెస్టు

2లో

## డిప్యుటేషన్‌పై రోజుకో డాక్టర్

(మొదటి పేజీ తరువాయి)

ఉంటూ వచ్చిన రోగులకు అప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తూ నెట్టు కొస్తున్నారు. అవసరమైన వసతులు, సౌకర్యాలు లేక ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం కేవలం నామమాత్రంగా మారిపోయింది. ఈ దయనీయ పరిస్థితిని గమనించిన మేడ్చల్ జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం, తన బృందంతో కలిసి ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తన్మయితో పాటు, చికిత్స కోసం వచ్చిన పలువురు రోగులను కలిసి మాట్లాడారు. వారి కష్టాలను, ఆసుపత్రి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వైద్య సేవలు పూర్తిగా శూన్యంగా మారిపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌కు సరైన అధిపతి (హెడ్) కానీ, జిల్లా స్థాయిలో ఇన్చార్జ్ కానీ లేకపోవడమే ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి శామీర్‌పేట ఆసుపత్రికి పూర్తి స్థాయి రెగ్యులర్ డాక్టర్లను, అవసరమైన నర్సింగ్ సిబ్బందిని నియమించాలని, రాత్రి వేళల్లో కూడా కచ్చితంగా వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజా సమస్యపై తాము ఊరుకునేది లేదని, జిల్లా కలెక్టర్‌తోపాటు ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిపిఎం జిల్లా నాయకులు శ్రీనివాస్, ఎ. అశోక్, ఎం. కిష్టప్ప తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.



నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

## విబిజి రాంజీ పథకం రద్దు చేయాలని వినతి

**కేశంపేట, జులై1 ప్రభాతవార్త:** దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అల్వల్ ఆధ్వర్యంలో కేశంపేట మండలంలోని లింగందాన, బైర్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఆయా గ్రామల ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కేశంపేట మండల పరిధిలో గల లింగందాన గ్రామంలో సర్పంచ్ నాగిళ్ల వెంకట్, ఉపసర్పంచ్ లావణ్య తిరుపతి రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీశైలంకు, బైర్‌ఖాన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ బైకాని శామంత, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నాగమణికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కుమ్మరి సుజాత, కార్యదర్శి నాగిళ్ల అంబేద్కర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఉపాధి హామీ కూలీలకు 100 రోజుల పనికి బదులుగా 200 రోజుల ఉపాధి కల్పించాలని, అందుకు తగిన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. వాటితో పాటు వీబీజీ రాంజీ పథకాన్ని ఉపసంహరిం చుకో వాలని, కార్మిక హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కానుగుల భాస్కర్, ఎండీ మోలానా, జాంగిర్, నాగిళ్ల ఎల్లయ్య, కానుగుల శ్రీను, నాగిళ్ల శ్రీశైలం, మైసయ్య, యాద గిరి, పద్మమ్మ, మల్లేష్, సభావత్ కృష్ణతో పాటు గ్రామ మహిళలు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

## అమ్మకానికి కుళ్లిన చేపలు, రొయ్యలు!

**హైదరాబాద్, జులై 1, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తూ, కుళ్లిన చేపలు, రొయ్యలను రసాయనాలతో నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఒక ముఠాను టాస్క్‌ఫోర్స్ గోల్కొండ బృందం, మంగళహాట్ పోలీసులతో కలిసి గుట్టు రట్టు చేసింది. మంగళహాట్ పరిధిలోని మాచిపురా బైఠక్ వద్ద గల "తార ఫిషరీస్" దుకాణంపై నిర్వహించిన ఈ ఆకస్మిక దాడుల్లో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులను శంకర్ సింగ్ , మాన్ సింగ్ , గులాబ్ సింగ్ , రోహిత్ సింగ్ గా గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ. 90,000 విలువైన 100 కిలోల పాడైపోయిన రొయ్యలు, 162 కిలోల వివిధ రకాల చేపలు (సాల్మన్, మారుల్), 6 బస్తాల ఉప్పు మరియు 10 కిలోల సోడియం బైకార్బోనేట్ పౌడర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రధాన నిందితుడు శంకర్ సింగ్ బేగంబజార్ మార్కెట్ నుండి తక్కువ ధరకే చేపలు, రొయ్యలను కొనుగోలు చేసేవాడు. జనావాసాల మధ్య ఉన్న తన దుకాణంలో ఏమాత్రం పరిశుభ్రత లేకుండా, కుళ్లిపోకుండా ఉండేందుకు , దుర్వాసన రాకుండా నిరోధించడానికి సోడియం పౌడర్‌ను ఉపయోగించేవాడు. వీటిని ప్లాస్టిక్ టబ్బులు, డీప్ ఫ్రీజర్లలో నిల్వ ఉంచి, తాజా చేపలుగా భ్రమింపజేస్తూ శుభకార్యాలకు, ఈవెంట్లకు మరియు హోటళ్లకు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టి లాభాలు గడిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇలాంటి నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అధికారులు హెచ్చరించారు. పక్కా సమాచారంతో పోలీసులు ఈ సంయుక్త దాడి నిర్వహించి నిందితులను పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ హైదరాబాద్ సిటీ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు , గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేష్, మంగళహాట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాఘవేంద్ర, సబ్ ఇన్‌స్పెక్టర్లు కె. వెంకటరమణ, ఎన్. నవీన్, ఆంజనేయులు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది.



బొక్కోనిగూడ టీచర్స్ కాలనీలో సెప్టిక్‌ట్యాంక్ గుంతలో చిక్కుకున్న నీటిట్యాంకర్

## రోడ్డుపైనే సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం

### -పట్టించుకొని అధికారులు

**ఘట్‌కేసర్, జులై 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇళ్ల నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా రోడ్లపై సెట్‌బ్యాక్ లేకుండా కట్టడాలు చేస్తున్నారు. అధికారులు అనుమతులు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయి. తాజాగా బొక్కోనిగూడ సర్వేనెంబర్లు 320 (పార్ట్), 321 లలోని టీచర్స్ కాలనీలో రోడ్డుపై సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేయగా అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోలేదు. భవనం నిర్మాణం చేసి హాస్టల్ ఏర్పాటు చేసిన యాజమాని డ్రైనేజీ కోసం భవనం ముందున్న 18 అడుగుల రోడ్డుపై గుంత తవ్వి సెప్టిక్‌ట్యాంకు నిర్మించారు. బుధవారం అటుగా వెళ్లిన నీటి ట్యాంకర్ ట్రాక్టర్ సెప్టిక్ ట్యాంకు మీదుగా వెళ్లగా కుంగిపోవడంతో ట్యాంకర్ గుంతలోకి కురుకుపోయింది. డ్రైవర్‌కు ప్రమాదం తప్పగా ట్యాంకర్ భాగం ధ్వంసమైంది. దీంతో ట్రాక్టర్ యాజమాని కట్ట హరినాథ్ రెడ్డి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. వెంచర్‌లో రోడ్డును తవ్వి గుంత తీసి మూతవేయగా ట్రాక్టర్ వెళ్లడంతో కూలిపోయిందని ట్యాంకర్ పరికరాలు దెబ్బతిన్నాయని ఆయన తెలియజేయగా తమకు విభాగానికి సంబంధం లేదంటూ అదికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఎంసి కమిషనర్, జిల్లా కలెక్టర్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

### హెచ్‌ఎంఆర్ఎల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి బాధ్యతలు

**హైదరాబాద్, జులై 1, ప్రభాతవార్త :**

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనే జింగ్ డైరెక్టర్‌గా బి. అజిత్ రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రసూల్ పురాలోని మెట్రో రైల్ భవన్ లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. హెచ్ ఎంఆర్ఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆయనను మర్యా దపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

# గుడిసెలను తొలగించకుండ

# అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

### కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం నాయకుల ఆందోళన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 1, ప్రభాతవార్త :** జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించకుండ అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అఖిలపక్షం నాయకులతో పాటు జిల్లా సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ, మాసలైన్ నాయకులు కలెక్టరేట్‌కు విచ్చేసి పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించవద్దని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన వ్యక్త చేశారు. జిల్లాలోని మేడిపల్లి, ఎన్‌సిఎల్ కాలనీల వద్ద ఉన్న గుడిసెలను తొలగించవద్దని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఆ తరువాత జిల్లా సిపిఐ నాయకులు కలెక్టరేట్‌లో డిఆర్ఓ మాలతిని కలిసి వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్, సిపిఎం శివన్నారాయణ, న్యూడెమోక్రసీ అనురాధ, మాసలైన్ ప్రవీణ్‌లు మాట్లాడుతూ వామపక్షాల ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలను సమీకరించి గుడిసెలు వేయించటం జరిగిందని, ఆ గుడిసెలను తొలగించాలని ప్రభుత్వం భావిస్తే పేద ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. వారికి పట్టాలు ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపులో ఎల్2పేరిట చూపిప సమాచారం



మేరకు వాహనాలు లేకున్నా ఉన్నట్టు చూపి వారిని అనర్హులుగా చెయటం అన్యాయమన్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ హాయంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రజలకు లక్షలాది రూపాయలకు అమ్మి భూముల జోలికి పోకుండా పేద ప్రజలు వేసుకున్న గుడిసెల దగ్గరికి వెళ్లటం అన్యాయమని, కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాదారుల వైపా, లేక పేద ప్రజల వైపా తేల్చుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజలను సమీకరించి మరో భూపోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, ధర్మేంద్ర, రచ్చకిషన్, సత్యప్రసాద్, నిమ్మల నర్సింహ్మా, సిపిఎం నాయకులు నరేశ్, న్యూడెమోక్రసీ నాయకులు శివబాబు, శ్యామ్, జయసుద, సురేశ్, ఫాతిమా, మాస్‌లైన్ నాయకులు లక్ష్మిబాయి, కనకమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

## పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

**పెద్దేముల్, జులై 1, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషిచేయాలని తాండూరు ప్రోగ్రెస్ స్కూల్ కరస్పాండెంట్ డా.కీర్తి శర్మ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ మహ్మత జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో దరిపల్లి రామయ్య (వనజీవి) జయంతి వేడుకలను తాండూరు కవయిత్రిమొల్ల కళావేదిక మొలక బాలల మాసపత్రిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా కీర్తి శర్మ మాట్లాడుతూ బాల్య దశలోనే వనజీవి రామయ్య ప్రకృతి ప్రేమను, సేవాభావాన్ని ప్రతివిద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కోటికి పైగా మొక్కలు నాటి భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నేల పర్యావరణాన్ని అందించాలనే సంకల్పంతో దరిపల్లి రామయ్య, జానకమ్మ దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తాండూరు పారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షిత: అనే సూక్తిని ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కేవిఎం వెంకట్ మాట్లాడుతూ చదివింది ఐదో తరగతి అయినప్పటికి ఆరో తరగతి పాఠంలో చేర్చారని, మహారాష్ట్రలో పాఠ్యపుస్తకంలో ఆయన జీవిత చరిత్రను చేర్చారని గుర్తుచేశారు. వనజీవి రామయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షీయూస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

## రాజకీయాలకు అతీతంగా 'సర్' ప్రక్రియ

**కీసర, జులై1, ప్రభాతవార్త :** ఓటరు జాబితాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం డివిజన్ 5లో ఈస్ట్ గాంధీనగర్ కాలనీ ఆధ్వర్యంలో విఆర్ఆర్ అపార్ట్‌మెంట్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఓలకు పలు సూచనలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని, వివరాల సవరణలు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు రాజకీయ నాయకులకు సైతం అవగాహన కల్పించాలని వారందరూ సహకారం అందించి దొంగ ఓట్లను, డబుల్ ఓట్లను తొలగించే ప్రక్రియకు తోడ్పటునివ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ వివరాలు తెలపాలని అదే విదంగా వారి భూములు సొంత స్థలాలు ఎక్కడ ఉన్న కూడా వారు ప్రస్తుతం ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటు హక్కు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, బిఎల్ఓ నర్సింహ్మారెడ్డి, వేదా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**శామీర్‌పేట, జులై 1, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదల సొంతింటి కలను నెరవేరుస్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీష కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ (మున్సి పాల్టీ) గ్రామంలోని 7వ వార్డులో గాదె మంజుల-శ్రీనివాస్ నిర్మిం చుకున్న ఇంది రమ్మ ఇళ్లను పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌తో కలిసి ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయిం చారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మం జూరు చేస్తుందని, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు వరంగా మారుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌తో పాటు కౌన్సిలర్ సామాల జశ్వంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎస్. అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఎల మల్లేశ్, కె.కృష్ణారెడ్డి, నాయకులు ఎ.భాస్కర్‌గౌడ్, మేడి మల్లేశ్, టి.యాదగిరి, కె.దినేశ్, చిలుగురి మల్లేశ్, బి.బాబు, నేమూరి రాంప్రసాద్, జె.బన్సిలాల్, ఎం.వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ శిరీషకృష్ణారెడ్డి



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం

**శామీర్‌పేట, జులై 1, ప్రభాతవార్త:** పోతాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట సందర్బంగ బుధవారం ఈ కార్యక్రమంలో పోతాయిపల్లి గౌడసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొని పూజలు చేశారు. ఆలయం నిర్మాణం అభివృద్ధి కోసం 11వేల రూపాయలు ఆయన విరాళంగ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్‌ను గౌడసంఘం వారు సన్మానించి సత్కరించారు.

## రవాణా కష్టాలకు చెల్లుచీటీ

(మొదటి పేజీ తరువాయి)

శాఖ ఆధ్వర్యంలో 15 గ్రామీణ రహదారుల అభివృద్ధికి సుమారు 35 కోట్ల రూపాయలతో పరిపాలనా ఆమోదం లభించిందని ఆయన తెలిపారు. వీటి ద్వారా 36.18 కి.మీ. మేర గ్రామీణ రహదారులు అభివృద్ధి చెందనున్నాయని తెలిపారు.

పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్ - 1.40 కి.మీ, సయ్యద్ మల్కాపూర్ 0.50 కి.మీ, బర్కత్‌పల్లి - 1.45 కి.మీ., రాఘవాపూర్-నంచర్ల శిజూదీ రోడ్డు నుండి లక్ష్మీదేవిపల్లి (ఫ్యాక్టరీ రోడ్డు) - 2.50 కి.మీ.పూడూర్ మండలం, నిజాంపేట్-మేడిపల్లి - 1.50 కి.మీ., మీర్జాపూర్ - 1.00 కి.మీ.తిమ్మాపూర్ (కొత్తపల్లి మీదుగా) - 3.60 కి.మీ, తిరుమలాపూర్ - 2.50 కి.మీ., కుల్కచర్ల మండలం బండమీది తండా (లాల్సింగ్ తండా మీదుగా రోడ్డు వరకు) - 3.50 కి.మీ, అనంతసాగర్ - 3.00 కి.మీ., చెల్మకుచ్చ తండా (మక్తా వెంకటాపూర్ తండా మీదుగా) - 4.00 కి.మీ.అల్లాపూర్ తండా నుండి చాకల్పల్లి తండా - 2.40 కి.మీ., దోమ మండలం, బొంపల్లి నుండి దోమ (పెద్ద తండా మీదుగా) - 5.60 కి.మీ, పాలెపల్లి - 2.10 కి.మీ. శివారెడ్డిపల్లి - 1.13 కి.మీ, అదే విధంగా గండీడ్ మహమ్మద్దబాద్ మండలాలకు పంచాయతీ రాజ్ ద్వారా 20 కోట్ల రూపాయల అంతర్గత రోడ్లు మంజూరు కావడం జరిగిందని ఆయన అన్నారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ.184.15 కోట్లతో 70.80 కి.మీ. రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. పరిగి నియోజకవర్గంలో మరికల్ - మొహమ్మ దాబాద్ రహదారి (కన్మంకల్వ, వెంకిరెడ్డిపల్లి మీదుగా) బలోపేతం పను లకు పరిపాలనా ఆమోదం లభించింది. కి.మీ. 0/000 నుండి 14/000 వరకు మొత్తం 14 కి.మీ. మేర రహదారిని అభివృద్ధి చేయనున్నారు రెండు శాఖల ద్వారా కలిపి 22 రహదారులపై మొత్తం 106.98 కి.మీ. మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం రూ.368.30 కోట్లతో ఈ పనులు అమలు కానున్నాయని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పరిగి నియోజకవర్గ అభివృద్ధి చేస్తా మని ఆయన తెలిపారు. సుమారు 27 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా అందించామని, మహిళలకు, రైతు కూలీలకు అన్ని వర్గాలకు ప్రభుత్వం సాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్, మండల అధ్యక్షులు వెంకట్ రాములు, పట్టణ అధ్యక్షుల రామకృష్ణ రెడ్డి, కౌన్సిలర్ల అజాజ్ , బాలు, చంద్రయ్య, కో ఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, ఆనంద్ చిన్న నర్సింలు, సర్పంచ్ అనంతయ్య, రాజపుల్ల రెడ్డి, రియాజ్, గౌతం, మాణిక్యం, సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నచ్చినోళ్లకే కాంట్రాక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఒకే పోస్టులో ఏళ్ల తరబడి కొనసాగుతూ, తనకు అనుకూలంగా వ్యవస్థను మార్చుకుంటున్నారని చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ అయినప్పటికీ, తిరిగి అదే కార్వాన్ సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారని ఆరోపి స్తున్నారు. టెండర్ నిబంధనల నుంచి బిల్లుల క్లియరెన్స్ వరకు ప్ర తీ విషయంలో తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, బిల్లు విడుదల చేయాలంటే కమిషన్ ఇవ్వాల్సిందేనంటూ కాంట్రాక్టర్ల మధ్య చర్చ జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి...

ఇటీవల విడుదల చేసిన మూసీ క్లీనింగ్ టెండర్‌లో కూడా ఇదే తర హా వ్యవహారం జరిగిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. తాము ప్రభుత్వానికి లాభం చేకూరేలా 26 శాతం లెస్‌కు కోట్ చేసినప్ప టికీ, తమ బిడ్‌ను పక్కనపెట్టి కేవలం రెండు శాతం లెస్ కోట్ చేసిన సంస్థకు టెండర్ కట్టబెట్టారని ఆరోపి స్తున్నారు. దీంతో ప్రభు త్వ ఖజానాకు ఎక్కువ ప్రయోజనం చేకూరే బిడ్ ను పక్కన పెట్టి, తక్కువ తగ్గింపు ఇచ్చిన సంస్థకు పనులు అప్పగిం చడం వెనుక అసలు కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ముందుగానే నిర్ణయిం చుకున్న సంస్థకు పనులు ఇవ్వాలనే ఉద్దేశంతోనే మొత్తం ప్రక్రియ నడిపించారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈవ్యవహారంపై ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కాంట్రాక్టర్లు తెలిపారు. కార్వాన్ సర్కిల్‌లో జరిగిన టెండర్ ప్రక్రియ తో పాటు, టెండర్ నిబంధనల రూపకల్పన, అర్హతల నిర్ణయం, టెక్నికల్ ఎవాల్యుయేషన్, వర్క్ ఆర్డర్ జారీ వరకు ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాం డ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో జరిగే పనుల్లో పారదర్శకత లేకపోతే ప్రజాధనం వృథా అవుతుందని, ఈ ఒక్క టెండర్ మాత్రమే కాకుండా గత నాలు గేళ్లుగా జరిగిన టెండర్లను బయటకి తీసి, విజిలెన్స్ విచారణ చేప ట్టాలని కోరుతున్నారు. దీంతో కమిషనర్, విజిలెన్స్ అధికారులు ఈ ఫిర్యాదులపై ఎలా స్పందిస్తారు..? ఎలాంటి చర్యలు తీసు కుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఈసీగా లక్ష్మణ్ గుప్త

**చాంద్రాయణగుట్ట, జులై 1, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా ఉప్పు గూడ దానయ్యనగర్ నివాసి సరాబు లక్ష్మణ్ గుప్త నియ మితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయంలో తెలం గాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త నుండి బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశుల అభివృద్ధికి కృషి చేస్తూ స్థానిక, జిల్లా సంఘానికి అధ్యక్షులుగా పనిచేసిన లక్ష్మణ్ సేవలను గుర్తించి రాష్ట్ర మహాసభలో అవకాశం కల్పించి నట్లు తెలిపారు. మహాసభ అభివృద్ధికి, సంఘీయుల అభ్యున్నతికి కృషి చేయగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతల మేరకు ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవం, మహాసభ ఉన్నతి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని లక్ష్మణ్ గుప్త పేర్కొన్నారు. పలువురు ఆర్యవైశ్యులు లక్ష్మణ్ గుప్తను అభినందించారు.

## వైభవంగా గణపతి స్వామి కళ్యాణం

**చార్మినార్, జులై 1 ప్రభాతవార్త :** దూద్‌బౌలి మహారాజ్‌గంజ్‌లోని శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వా మి మరియు శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి దేవస్థా నములలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి మంది రంలో బుధవారం అత్యంత వైభవంగా శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి వారి కళ్యాణం జరిగింది. పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు కళ్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం వంశ పారంపర్య ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాస్‌చారి, దేవాలయాల ధార్మిక సలహాదారులు చల్లా మల్లిఖార్జున శర్మ, అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయ చార్య స్వామి, దేవాలయం ప్రధాన అర్చకులు సి.వీరయ్య శర్మ, కార్యవర్గ సభ్యులు మహే శ్వరం నాగేశ్వర చారి, తిరుమల వంశీ చార్యతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## విద్యా నిధి పథకానికి నేటి నుంచి దరఖాస్తుల నమోదు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 1, ప్రభాతవార్త:** తెలంగాణ అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన వారు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో చేసుకోవాలని మేడ్చల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ సూచించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కోసం ఈ నెల 2నుంచి 31వ తేదీ వరకు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా అధికారి వినోద్‌కుమార్ కోరారు.

## సిఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి గడువు పొడిగింపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 1, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మైనార్టీస్ విద్యార్థులు ఛీఫ్‌మినిష్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం స్ప్రింగ్ సీజన్ 2026 కోసం దరఖాస్తులు చేసుకోవాలని, ఈ నెల 15వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు మేడ్చల్ జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ సూచించారు. అమెరికా, యుకె, ఆస్ట్రియా, కెనెడా, సింగపూర్, జర్మనీ, దక్షిణకొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో 1 జనవరి 2026 నుంచి 30 జూన్ 2026వరకు పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పిహెచ్‌డి అధ్యయానాల్లో ప్రవేశం పొందిన ప్రభుత్వ అర్హత నియమాలన్నింటిని నెరవేర్చిన అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు. ఈ నెల 15వ తేదీ దరఖాస్తులు చేసుకోవటానికి గడువును పొడిగించారని, దరఖాస్తులు చేసుకున్న వారు హార్డ్ కాపీలను పత్రాలను ఈ నెల 31వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ.20లక్షలు, 60వేల రూపాయలు వన్ విమాన చార్జీలు ఇవ్వబడుతుందని అన్నారు. విద్యార్థులు విద్యార్హత, వార్షిక ఆదాయం ధృవపత్రాలతో అర్హులైన మైనార్టీస్ విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు మేడ్చల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో లేదా ఫోన్‌నెంబర్లు 9866561235 లేదా 9000168256లో సంప్రదించాలని ఆమె సూచించారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సాజిదా బేగం

## ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యం వద్దు

**ధారూర్, జులై 1, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ సాజిదా బేగం అధ్యక్షతన సమావేశం జరిగింది. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆమె ఎస్.ఐ.ఆర్ కు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.ఐ.ఆర్ అమలులో ఎదురవుతున్న సవాళ్లు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, దానికి సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలపై తహసీల్దార్ సాజిదా బేగం పార్టీ నాయకులతో చర్చించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకుండా, పారదర్శకతతో ప్రజలకు సేవలు అందేలా చూడాలని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్.ఐ.ఆర్ పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ఈ విషయంలో పార్టీలకతీతంగా నాయకులందరూ సహకరించాలని కోరారు. ఆర్ఐ స్వప్న, పలువురు పార్టీల బాధ్యులు, నాయకులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్యుమరేషన్ పత్రాలను అందిస్తున్న ఆర్టీఎ మెంబర్ జైపాల్‌రెడ్డి

## ఊపందుకుంటున్న ఓటరు సవరణ

**శామీర్‌పేట, జులై 1, ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఓటర్లను ఇంటింటా కలిసి ఎన్యుమరేషన్ పత్రాలను జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి అందజేశారు. ఓటర్లకు ఇంటింటా ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం సర్‌పై అవగాహన కల్పించాలని బిఎల్ఓలకు, అధికారులకు ఆయన సూచించారు. అందజేసిన పత్రాలను నింపి తిరిగి బిఎల్ఓలకు అందజేయాలని ఆయన సూచించారు. శామీర్‌పేట డివిజన్ పరిధిలోని శామీర్‌పేట, బొమ్మరాసిపేట్ గ్రామాల్లోని వివిధ పోలింగ్ బూత్‌లలో ఓటరు సవరణ ప్రక్రియపై జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇ.శ్రీనివాస్, బిఎల్ఓలు కవిత, మమత, శకుంతల, పావని, మనోహర, నిర్మల, జ్యోతి, బిఎల్ఏలు ఎం. అంజనేయులు, ఎస్.బాల్‌రాజ్, పి.అశోక్, కట్టమైసమ్మ ఆలయ మాజీ చైర్మన్‌లు వి.అశోక్, ఎం.మహేందర్‌యాదవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

గత 20 సంవత్సరాలుగా భూమి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా ఇవ్వాలని పేర్కొన్నారు. పూడూరు మండలం మైసమ్మ తాండకు సంబంధించిన సర్వే నంబర్ 265 లో 12 ఎకరాల భూమి 50 సంవత్సరాలు నుండి సాగు చేసుకుంటున్నా రైతులు వేసుకున్న పంటను దౌర్జన్యంగా అటవీ అధికారులు నాశనం చేసి, వేసుకున్న షెడ్ కూడా ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. ఈ ధర్నా సందర్భంగా ఆ గ్రామస్తులు తమ గోడును చెప్పుకోవడంతో వారిని తీసుకొని అడిషనల్ కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. సమస్యలపై అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి పీర్ మహమ్మద్, అనంతయ్య, వెంకటేష్, అబ్దుల్లా, సురేష్, మునీర్ అహ్మద్, బాబు, పుష్ప, ఖాదర్, సావిత్రి, విమలమ్మ, ఆచారి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

**చార్మినార్, జులై1 ప్రభాతవార్త :** ఆషాడ మాసం సంద ర్భంగా ఈ సంవత్సరం జూలై నెల 26న విజయవాడ శ్రీ కనక దుర్గమ్మకు సమర్పించనున్న బంగారు బోనం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఏపి దేవాదా య శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ పాతబస్తీ నుంచి పెద్ద ఎత్తున కళాకారులతో పాటు భక్తులు విజయవాడకు తరలి వచ్చి శ్రీ కనక దుర్గమ్మకు బంగారు పాత్రలో బోనం సమర్పించనున్నామని వారుమంత్రికి అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆగష్టు నెల ఏడవ తేదీన పాతబస్తీలోని అమ్మవార్లకు శ్రీ కనక దుర్గమ్మ తల్లి పాలక మండలి తరుపున పట్టు వస్త్రాలు సమర్పించాలని వారు మంత్రిని కోరారు. ఈకార్యక్రమంలో భాగ్యనగర్ శ్రీ మ హంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయా ల ఊరేగింపు కమిటి చైర్మన్ మల్యాల మధుసూధన్ యాదవ్, మాజీ అధ్యక్షులు గాజుల అంజయ్య, జనగామ మధుసూధన్ గౌడ్, ప్రతినిధులు నోముల ప్రకాష్, కోటిరె డ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**కొత్తూరు, జూలై 1, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్గా సాహితి రెడ్డి బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన కవి ఎషనర్ స్థానంలో ఆమె నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే మున్సిపల్ అధికారులతో సమావేశమైన సాహితి రెడ్డి, పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వ హణ, తాగునీటి సరఫరా, పౌర సేవల అమలుపై సమగ్రంగా సమీక్షించారు.



నూతన మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వేగంగా పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యంతో కూడిన పరిపాలన అందిస్తూ, మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ప్రజల సహకారంతో కొత్తూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

## బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



పూడూరు మండలం కడ్మూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారిణి రజిని,ఎంఇఓ సాయిరెడ్డి తదితరులు

**జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారిణి రజిని**

**పూడూరు, జూలై 1 ప్రభాతవార్త ;** బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని వికారాబాద్జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారిణి రజిని పేర్కొన్నారు.బుధవారం పూడూరు మండలం పరిధిలో కడుమూరు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సంధర్భంగా మఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నాణ్యతగలవిద్యను అందించే ప్రభుత్వబడుల్లో పిల్లలను చేర్పించాలన్నారు.తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తే ఆటపాటలతోపాటు విద్యాభ్యాసన పట్ల శ్రద్ధచూపే అవకాశం ఉందని వివరించారు.అనంతరం మండల విద్యాధికారి సాయిరెడ్డి,సర్పంచ్ శివశంకర్తో కలిసి విద్యార్థులకు ఓనమాలు దిద్దించి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో చెన్గోముల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రకాంత్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు,ఉపాధ్యాయులు హరీష్బాబు,అనూష,పంచాయతీ కార్యదర్శి వెంకట్రెడ్డి, నాయకులు మొర్రి చిన్న బందయ్య(అనీల్),పోచయ్య, రాజు,అనంతయ్య,అంగన్వాడీ కార్యకర్తలు వెంకటమ్మ,వినోద, విద్యార్థుల తల్లిదండ్రులు రమేష్,శేఖర్,క్రిష్ణవేణి,నర్సింలు, అంజయ్య,చెంద్రశేఖర్,పల్లవి,లింగం,యాదయ్య,రవీందర్,లక్ష్మణ్,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీ కొని విద్యార్థి మృతి

**చేవెళ్ల, జూలై 1, ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం జరిగింది.చేవెళ్ల పోలీసుల కథనం ప్రకారం కందవాడ గ్రామానికి చెందిన శేరి సాత్విక్రెడ్డి (16) మొయినాబాద్ మండల పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు వెల్లేందుకు షాబాద్ చౌరస్తా వద్ద బస్సు కోసం నిలబడి ఉండగా చేవెళ్ల నుండి హైదరాబాద్ వెళ్తుండగా షాబాద్ నుండి కార్ రావడంతో కార్ను తప్పించబోయి అర్టిసి బస్సు కోసం నిలబడిన విద్యార్థినిపైకి బస్సు దూసుకువెల్లింది. ఒక్కసారిగా బస్పైకి రావడంతో సాత్విక్రెడ్డి అక్కడిక్కడే మృతి చేందాడు. స్దానికులు వెంటనే అసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు సంఘటన స్దలంకు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం మృత దేహంను బంధువులకు అప్పగించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ ..ఒకరు మృతి

**కొడంగల్,జులై 1, ప్రభాతవార్త:**

కొడంగల్ పట్టణ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు.ఎస్సై జీవీ.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం అర్ధరాత్రి పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో హైద్రాబాద్.బిజాపూర్ జాతీయ రహదారిపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు.మృతుడి ఆచూకి తెలియకపోవడంతో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురి గదిలో ఉంచడం జరిగిందని ఎస్సై తెలిపారు.గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి

**కొడంగల్,జులై 1,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన చాకలి లక్ష్మీ(40) ద్విచక్ర వాహనంపై నుంచి పడి మృతిచెందింది.ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మహిళ కుమార్తె నవిత తాండూర్లోని కస్తూర్బా కళాశాలలో ఇంటర్ చదువుతుంది.కూతురును చూసేందుకు లక్ష్మీ మరిది అయిన నందుతో కలిసి రుద్రారం నుంచి పాటిమీదిపల్లి మీదుగా తాండూర్ వెళ్తుంది.మార్గమద్యలో పాటిమీదిపల్లి సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి సంఘటన స్దలంలోనే మృతిచెందింది.మృతురాలి భర్త గత నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందాడని,దీంతో అమెకు ఉన్న ముగ్గురు పిల్లలు అనాధలైయ్యారని తెలిపారు.మృతురాలి సోదరుడు దస్తప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రభావిత భూముల ఎంజాయ్ మెంట్ సర్వే..

**దుద్యాల్, జులై 1, ప్రభాతవార్త:** నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద కాల్వ నిర్మాణంలో భూ ప్రభావిత రైతులకు ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించ నున్నట్లు తహసిల్దార్ కిషన్ తెలిపారు.



దుద్యాల్ మండల తహసిల్దార్ కిషన్..

దుద్యాల్ గ్రామానికి సంబంధించిన రైతుల సర్వేనెంబర్ వివరాలు గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ప్రదర్శించడం జరిగిందని, అట్టి రైతులు గురువారం నాడు తమ పొలాల దగ్గర ఉండి ఎంజాయ్మెంట్ సర్వే చేసుకుని రెవెన్యూ అధికారులకు సహకరించాలన్నారు. మండల సర్వేయర్, ఆర్ఐ, జిపివో ల సమక్షంలో సర్వే

# నైట్ హాల్ట్ బస్సులు పునః ప్రారంభం చేయండి



కలెక్టర్కి వినతిపత్రం అందజేస్తున్న యాచారం మండల నాయకులు

**యాచారం,జులై 1 ప్రభాతవార్త :** ఇబ్రహింపట్నం డిపో ఆర్టీసీ అధికారులు ఇష్టం వచ్చినట్లు బస్సులు నడుపుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలను రైతులను మహిళలను ఉపాధి కూలీలు ,విద్యారులు నానా ఇబ్బందులూ పడుతున్నారు అని, పి ఆర్ జి ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త అన్నారు. యాచారం మండలంలోని తాటిపర్తి , కుర్మిద, మేడిపల్లి, ముద్విన్, కొత్తపల్లి, మొండి గౌరెల్లి, అజిలాపురం నైట్ హాల్ట్ బస్సులు పునః ప్రారంభం చేయాలని పలుమార్లు ఇబ్రహింపట్నం డిపో మేనేజర్కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఒక సారి రంగారెడ్డి జిల్లాకలెక్టర్కు, రెండు సార్లు ఇబ్రహింపట్నంలో ప్రజావాణిలో ఆర్టీసీ బస్సులు పునః ప్రారంభం చేయాలని వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదు. ఇబ్రహింపట్నం డిపో నుంచి తాటిపర్తి ఉమెన్స్ కాలేజీ పోవు బస్సులు ఇబ్రహింపట్నం వరకు నడుపుతున్నారు .ఈ బస్సులు ఇబ్రహీంపట్నం నడపడంతో డబ్బులు తక్కువగా వస్తున్నాయి అని, పాఠశాలకు సెలవుల పేరుతో గ్రామీణ ప్రాంతాలకు వచ్చే బస్సులు బంద్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్లినా యధావిధిగా నడపాలని కోరుతున్నాము. ఇబ్రహింపట్నం డిపో మేనేజర్ ఇప్పటికైనా స్పందించి బస్సులు యధావిధిగా నడపాలని పిఆర్జి ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త డిమాండ్ చేస్తున్నారు. లేనిచో విద్యార్థులు మహిళలు రైతులతో కలిసి ఆందోళన తప్పదు అని అన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

**కుల్కచర్ల,జూలై 1 ప్రభాతవార్త:** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. పిఎసిఎస్ సిఈఓగా విధులు నిర్వహించిన బక్కరెడ్డి పదవీ విరమణ వీడ్కోలు సమావేశం బుధవారం మండలంలోని పివిఆర్ ఫంక్షన్హల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,తాండూర్ ఎమ్మెల్యే మనోహర్రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పదవీ విరమణ పొందుతున్న బోజ్జన్నగారి బక్కరెడ్డి,అతని భార్య జయమ్మను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..విధి నిర్వహణలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా ఉంటాయని అన్నారు.కుల్కచర్ల . పిఎసిఎస్ సిఈఓగా పనిచేసిన బక్కరెడ్డి క్రమశిక్షణకు కట్టుబడి, సమయ పాలన పాటించి,రైతులకు అన్ని రకాలుగా సహరించుకుంటు పిఎసిఎస్ అ పిఎసిఎస్ అభివృద్దికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ కనకంమొగులయ్య,డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, పిఎసిఎస్వైస్ ఛైర్మన్ నాగరాజ్, చౌడపూర్ మండల అధ్యక్షులు శేఖర్, మాజి రైతు బంధు అధ్యక్షులు రాజు,అయ గ్రామాల సర్పంచులు, అయా గ్రామల రైతులు, నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



పదవీ విరమణలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి,

# రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి

**యువకుడు, ట్రాన్స్ జెండర్ మృతి**

**ఆమనగల్లు, జూలై 1, ప్రభాత వార్త:** ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆమనగల్లు పోలీస్ ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మండల పరిధిలోని ఆకుతోట పల్లి గ్రామ సమీపంలో మాడుగుల రహదారి సమీపంలో ఆపి ఉన్న మహీంద్రా కమాండర్ వాహనం టీఎస్12 ఈ ఎన్ 5931 వాహనమును రిజిస్ట్రేషన్ నంబర్ లేని కొత్త ప్యాసింజర్ ఆటో నిర్లక్ష్యంగా వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది.

దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ట్రాన్స్జెండర్ వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి, కల్వకుర్తికి తరలించగా అందులో ఒకరు అమ్ములు (26) అనే వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు వ్యక్తులకు చికిత్స అందించారు.

**జంగారెడ్డిపల్లి గ్రామం వద్ద ప్రమాదం....**

బుధవారం మధ్యాహ్నం సుమారు 3:40 గంటలకు జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని మర్రెన్కుంట అలుగు కల్వర్టు వద్ద టీవీఎస్ మోటార్సైకిల్ మరియు అశోక్ లేలాండ్ వాహనం టీజి 07 యు 3045 ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాడుగుల మండలం ఫకీర్ తండ కు చెందిన రామావత్ మల్లేష్ (28) తీవ్రంగా గాయపడగా, వెంటనే ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి, తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు, ప్రయాణాలలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెస్సులుకోవాలని ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు సూచించారు.

# గౌడన్నలకు రక్షణ కిట్స్ అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జూలై 1. ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలోని 31 మంది కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం మంజూరీ చేసిన రక్షణ కిట్స్ను ఎమ్మెల్యే మల్లారెడ్డి బుధవారం బోయినపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌడన్నలు తాటిచెట్లు ఎక్కేటప్పుడు ప్రమాదాలు బారినసడకుండా ఉండేందుకు గాను ఈ కిట్స్ ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రమాదాల బారిన పడొద్దని భావించి వారికి ప్రత్యేకంగా సేఫ్టీ కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కిట్లను ప్రతి లబ్ధిదారుడు ఉపయోగించి సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ జిల్లా అధికారి గంగా ధర్ , మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ గ్రంధాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గౌడన్నలకు రక్షణ కిట్స్ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## ప్రవీణ్కుమార్పై కక్ష సాధింపుచర్యలకు పాల్పతే సహించేదిలేదు

**ఆర్ఎస్ ప్రవీణ్కుమార్కు పోలీసులు భద్రత కల్పించాలి**

**చేవెళ్ల, జూలై 1, ప్రభాతవార్త:** మాజీ ఐపిఎస్, బిఆర్ఎస్ సీనియర్ నేత అర్ఎస్ ప్రవీణ్కుమార్కు పోలీసులు భద్రతను ఏర్పాటు చేయాలని, తొలగించిన వై కెటగరి భద్రతను మళ్లీ పునరుద్దరించాలని చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు డిమాండ్ చేశారు.బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్పై కక్ష సాధింపుచర్యలకు పాల్పతే సహించేదిలేదని, సిఎం రెవంత్రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్లు కుట్ర చేశారన్నారు. నక్సలైట్ల,ఫ్యాక్ష్యనిస్టుల హిట్ లిస్టులో ఉన్న ప్రవీణ్కుమార్కు ఏమైనా జరిగితే పూర్తి భాధ్యత ప్రభుత్వందే నన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరిత రాజకీయాలను మానుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విదానాలపై ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ పోరాటం చేస్తుండగంతో కక్ష సాదింపులకు పాల్పడుతన్నారన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్కుమార్కు లబభిస్తున్న ఆదరణను చూసి సిఎం రేవంత్రెడ్డి తట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వానికి తగిన గుణ పాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి విజయ్ ఆర్య క్షత్రియ, చేవెళ్ళ మాజీ ఎంపిపి విజయభాస్కర్రెడ్డి, చేవెళ్ల మండల బిఆర్ఎస్ అద్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్,ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ బేగరి నర్సింలు, సీనియర్ నాయకుల నత్తి క్రిష్ణారెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, దండు సత్యనారాయణ, తలారి యాదయ్య,మిట్ట వెంకటరంగారెడ్డి, చందు,దుత మల్లేష్, కోటాల మల్లేష్, సిద్ది బాలు, మద్దేల నానీ, కటికే శివశంకర్, గుద్దేన్నోళ్ల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్ ప్రవీణ్కుమార్కు భద్రత కల్పించాలని చేవెళ్లలో దర్నా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



సభలో మాట్లాడుతున్న ఎల్హెచ్పీఎస్ నాయకులు

**విజయవంతమైన**

## ఎల్హెచ్పిఎస్ 30వ అవిర్భావ సభ

**కొడంగల్,జులై 1,ప్రభాతవార్త:** లంబాడ హక్కుల పోరాట సమితి 30వ అవిర్భావ సభ బుధవారం పట్టణంలోని ఓ పంక్షణ్హాల్లో నిర్వహించారు. ముందుగా పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి సభాస్థలి వరకు ర్యాలీగా తరలివెళ్ళారు.అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ లంబాడిల బాష అయిన గోరిబోలిని 8వ మాతృబాషగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలోనే ఢిల్లీలోని జంతర్మంత ర్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు .ఎస్టీ రిజర్వేషన్ ప్రకా రం కేంద్ర ప్రభుత్వం 14 శాతం కల్పించాలని ,తెలంగాణా రాష్ట్రంలో ఎస్టీలను 10శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు . అలాగే తండాలనురెవెన్యూ గ్రామాలుగా చేయాలని ,బంజారాలను ఒకే ఎస్టీ జాబితాలో చేర్చాలని ,గిరిజనులకు లావణీ,సీలింగ్ ,పోడుభూములకు శాశ్వతంగా హక్కుల కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ అద్యక్ష,ప్రధాన కార్యదర్శులు దాస్రాంనాయక్,డాక్టర్ నరేందర్ పవార్,రాష్ట్ర అధ్యక్షులురాజేష్నాయక్,సంతోష్నాయక్ ,గోవింద్నాయక్, బాలునాయక్,వాసునాయక్,మున్సిపల్ వైస్చైర్మేన్ శంకర్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్కు తిరుపతి లడ్డు ప్రసాదం అందజేసిన మేడ్చల్ బిఆర్ఎస్ నాయకులు

**మేడ్చల్, జూలై 1. ప్రభాతవార్త :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను మేడ్చల్ బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్లు నగరంలో కేటీఆర్ వద్దకు వెళ్లి ఈ సందర్భంగా తిరుపతి లడ్డు ప్రసాదం అందజేశారు.




కేటీఆర్కు ప్రసాదం అందజేస్తున్న మేడ్చల్ బిఆర్ఎస్ నేతలు

# ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

**యాచారం,జులై1, ప్రభాతవార్త :** నేటి నుండి అమల్లోకి వస్తున్న వి బి జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని సిఐటియు రాష్ట ఉపాధ్యక్షులు భూపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కే జగన్,,పి అంజయ్య డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర కమిటీ పిలుపు మేరకు యాచారం ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వామపక్ష పోరాటాల ఫలితంగా గ్రామీణ పేదలకు వందరోజుల ఉపాధి హామీ పథకం ఏర్పడిందని అన్నారు. 90 కేంద్రం నిధులు కేటాయిస్తూ పది శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులతో గ్రామీణ పేదలకు వంద రోజులు పని కల్పించడం జరుగుతుందని దాని ద్వారా పేదలు తమ జీవితాల్లో వెలుగులు తెచ్చుకుంటున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని పరోక్షంగా నిర్వీర్యం చేయడానికి కుట్ర చేసిందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి వికసిత భారత్ గ్యారంటీ రోజ్ గార్ అభిజిత్ మిషన్ రూరల్ వి బి జి రాంజీ పేరు మార్చి కేంద్రం 60 శాతం నిధులు, రాష్ట్రం 40 నిధులతో పథకం నడపాలని నిబంధన పెట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్రాల నిధుల లేమితో 40 కేటాయించలేక క్రమంగా ఉపాధి హామీ పథకాన్ని పేదలకు లేకుండా చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం రద్దుచేసి యధావిధిగా పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు ప్రజాసంఘాలను ప్రజాతంత్ర వాదులను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్ర కుమార్,ఎం చంద్రమోహన్ జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్, దేవేందర్ సిఐటియు జిల్లా సహాయ కారదర్శి ఆలేటి ఎల్లయ్య, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ చందు నాయక్, శేఖర్, వెంకన్న, విజయ్, జానీ ,ఆలి భాష, రామస్వామి ,భాస్కర్, కే జంగయ్య శీలం జంగారెడ్డి దితరులు పాల్గొన్నారు.




ఎంపిడివో కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న సిపిఎం పార్టీ నాయకులు



లాల్గడిమలక్పేట్కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు మామిండ్ల శ్రీనివాస్ బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ను నగరంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించిన దృశ్యం

## బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ను కలిసి సన్మానించిన మామిండ్ల శ్రీనివాస్

**శామీర్పేట, జూలై 1, ప్రభాతవార్త:** బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ను బిజెపి సీనియర్ నాయకులు మామిండ్ల శ్రీనివాస్పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శామీంపేట మండలంలోని లాల్గడిమలక్పేట్ నుంచి హైదరాబాద్ పర్యటనలో ఉన్న బిజెపి జాతీయఅధ్యక్షులు నితిన్ నబీన్ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. తెలంగాణలో బిజెపి స్థితిగతుల గురించి పార్టీ బలోపేతం గురించి చర్చించినట్లు, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యకలాపాలు విస్తరించే విధంగా బిజెపి కార్యక్రమాలు ఉంటాయన్నారు. నాయకులు ప్రజల్లో ఉండాలని తెలంగాణలో అధికారం దిశలో పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించినట్లు బిజెపి నాయకులు మామిండ్ల శ్రీనివాస్ తెలిపారు.

## సిఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి



అలియాబాద్ రైతు వేదికలో రైతుభరోసా నిధుల విడుదల చేసి సిఎం రేవంత్రెడ్డి నగరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించటంతో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, పలువురు అధికారులు, నాయకుల, రైతుల దృశ్యం

**శామీర్పేట, జూలై 1, ప్రభాతవార్త:** నగరంలోని శిల్ప కళావేదిక నుంచి సిఎం రేవంత్రెడ్డి భరోసా నిధులను విడుదల చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించటంతో దీనిలో అలియాబాద్ రైతువేదిక నుంచి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డిలు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శామీర్పేట మండలంలోని అలియాబాద్ రైతు వేదికలో సిఎం రేవంత్రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ను వీక్షించారు. సిఎం రేవంత్రెడ్డి చేసిన ప్రసంగాన్ని పలువురు వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డితో పాటు అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్, కౌన్సిలర్ జశ్వంత్రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, కిసాన్ సెల్ బి బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, రైతులు సంజీవరెడ్డి, జగన్మోహన్రెడ్డి, మల్లేశ్, సుధాకర్రెడ్డి, రవీందర్రెడ్డి, కృష్ణారెడ్డి, రమేశ్, రాజు, మహేశ్వరి, పద్మ,మండల వ్యవసాయ అధికారి రమేశ్, విస్తీర్ణ అధికారులు సుధీర్కుమార్, శ్రీనాథ్, ఉద్యాన వన అధికారి సాగరిక, ఆర్ఐ కవిత తదితరులు పలువురు రైతులు పాల్గొన్నారు.

## వృద్ధుడిని హత్య చేసిన యువకుడు అరెస్టు

**జవహర్ నగర్, జూలై 1. ప్రభాత వార్త:** సంతోష్ నగర్ బాలాజీ నగర్కు చెందిన మడిగే దేవరాజు అలియాస్ ఉప్పరి దేవరాజు (83) హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం, దేవరాజు గత కొంతకాలంగా సంతోష్ నగర్లోని తన నివా సంలో ఉంటున్నారు. ఆయనకు ఐదుగురు కుమారులు ఉండగా, వృద్ధాప్యం కారణంగా కుమారులే ఆయన బాగోగులు చూసుకుంటూ వస్తున్నారు.



ఉదయం సుమారు 7 గంటల సమయంలో దేవరాజు ఇంటి పక్కన నివసించే రమేష్ అనే వ్యక్తి, దేవరాజు కుమారుడు ఉప్పరి ప్రభాకర్కు సమాచారం ఇచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో దేవరాజు ఇంటికి గుర్తుతెలియని వ్యక్తి వచ్చినట్లు, ఇంట్లో గొడవ జరిగినట్లు తెలిపాడు.దీంతో ప్రభా కర్ వెంటనే తన తండ్రి నివాసానికి వెళ్లి చూడగా, దేవరాజు తన గదిలో నేలపై రక్తపు గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఆయన తల వెనుక భాగంలో తీవ్ర గాయాలు కనిపిం చాయి. అదే గదిలో ఉన్న మంచంపై గుర్తుతెలియని వ్యక్తి పడుకుని ఉండటం గమనించాడు.ప్రభాకర్ అతనిని ప్రశ్నించగా, తన పేరు ఎడ్ల దేవ (30), తండ్రి పేరు వెంకటేష్, స్వస్థలం సిద్ధిపేట అని చెప్పినట్లు తెలిసింది. అయితే అతడు పొంతనలేని సమాధానాలు ఇస్తూ, ఆ ఇల్లు తనదేనని పేర్కొన్నాడు. అనంతరం పోలీసుల విచారణలో, రాత్రి ఇంట్లోకి వచ్చినప్పుడు వృద్ధుడు లైట్ వేయడంతో కోపం వచ్చి, పిడికిలితో పలుమార్లు తలపై దాడి చేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం. అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు ఎడ్ల దేవను అదుపులోకి తీసుకున్నారు. దేవరాజు కుమారుడు ఉప్పరి ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## వీధి కుక్కల దాడిలో 18 మేకలు మృతి

**చేవెళ్ల, జూలై 1, ప్రభాతవార్త:**

చేవెళ్ల మండల కేంద్రంలో మేకల మందపై వీధికుక్కలు దాడి చేసిన సంఘటనలో 18 మేకలు మృతి చెందాయి. చేవెళ్ల గ్రామానికి చెందిన రైతు కిష్టయ్యకు చెందిన మేకలు గుంపుపై మంగళవారం రాత్రి వీధి కుక్కలు దాడి చేయగా 18 మేకలు అక్కడిక్కడే మృతి చెందాయి. దాడి చేస్తుండటంతో మందలో ఉన్న మరో 200 మేకలు ప్రాణభయంతో పరుగెత్తి కిష్టయ్య ఇంటికి చేరుకోవడంతో ఏమైం దని వెళ్లి చూడగా కుక్కలు దాడిచేసి మేక లు చంపిన దృశ్యం కన్పించింది.విషయం తెలుసుకున్న వెంటనే చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్లు చేరుకుని సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందచేస్తామన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT SANGAREDDY
I.A.NO. 2255 OF 2023
IN
O.S.NO. 76 OF 2023
BETWEEN:
Smt. Sugunamma & Others ...Petitioner/Plaintiffs
AND
Smt. Durga Reddy & others ....Respondents/Defendants
NOTICE
To
1. (R11) Sri. Amjad Khan S/o. Ahmed Khan, Aged35 years, Occ: Business, R/o. H. No. 5-20, Chandanagar, Serilingampally, RR Dist.
Please take notice that the Plaintiffs filed suit for partition and separate possession over the suit scheduled properties against your father Sri. Ahmed Khan. Meanwhile, the plaintiff came to know that your father namely Ahmed Khan died as such the plaintiff filed legal heir petition of Ahmed Khan as you are the legal heir of late. Ahmed Khan along with you and others before the Hon'ble Prl. District judge, Sangareddy and said suit is posted on 24-07-2026 at 10:30 AM., for your appearance, please appear by person or through Counsel on above said date and time. If you are fail to appear the above in the said Hon'ble court and the Hon'ble court will decide the suit on merits.
//BY ORDER OF THE COURT//
M.GOVARDHAN
Advocate,
Sangareddy.

## కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పి స్నేహమెహ్రా

**కుల్కచర్ల, జూలై 1 ప్రభాతవార్త:** కుల్కచర్ల పోలీస్‌స్టేషను జిల్లా ఎస్పి స్నేహమెహ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో గదులు, మరియు రికార్డులు పశీలించారు. ఎటువంటి ఫైళ్లు పెండ్‌లో ఉంచకుండా, దర్యాప్తును వేగవంతంచేసి బాధితులకు త్వరగా న్యాయం అందించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషనుకు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచాలని ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించేలా కృషి చేయాలని రాత్రి గస్తీని ముమ్మరం చేసినేరాలను అదుపుచేయాలని స్పష్టం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో చెట్లను నాటి నీరు పోశారు. డిఎస్‌పి శ్రీనివాస్, సిఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ రమేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పిస్నేహమెహ్రా

## పేదోడి సొంతింటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

**కొడంగల్, జులై 1, ప్రభాతవార్త:** పేదోడి సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోచమ్మతండాకు చెందిన మెగావత్ శంకర్‌నాయక్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని తండా సర్పంచ్ ముడావత్ సునితరాజునాయక్ సమక్షంలో ప్రారంబించారు. అనంతరం మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్, పర్సాపూర్‌లో సర్పంచ్ కన్నం రాధాశ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్సాపూర్, పాతకొడగల్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి ప్రత్యేక కృషితో ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరీ చేసి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్దిక సహాయాన్ని ప్రబుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో లబ్దిదారులు ఆధునిక సౌకర్యాలతో కూడిన మోడల్ ఇండ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇండ్లను నిర్మించుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జైపాల్‌రెడ్డి, పోచమ్మతండా ఉపసర్పంచ్ శంకర్‌నాయక్‌లతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేవంతెనపై రాజకీయాలు చేయడం మానుకోవాలి

-ప్రజావసరాలను తీర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెనపై కొందరు నాయకులు రాజకీయాలు చేయడం మానుకొని అభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న ఆర్‌ఓబి పనులను బుధవారం ఆర్‌అండ్‌బి ఈఈ రమేశ్ పరిశీలించి కార్మికులు లేని కారణంగా జాప్యం జరిగిందని డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిసిసి కార్యదర్శి ముత్యాలుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఓబిని మంజూరు చేసి 2013లో శంకుస్థాపన చేసిందని ప్రారంభోత్సవం కూడా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. రైల్వేవంతెన పనులు 80 శాతం పూర్తి అయ్యాయని మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. వంతెనకు అవసరమైన నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందని పనులు పూర్తి కాగానే దశలవారిగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. వంతెన కోసం ఎవరు కూడా విరాళాలు, బిక్షాటన, స్టీల్, సిమెంట్, ఇసుక, కంకర సేకరించాల్సిన అవసరం లేదని సామాగ్రి విషయంలో కాంట్రాక్టర్‌కు బాధ్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వంతెన పూర్తి చేయడానికి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు తగిన ఆదేశాలు జారీ చేసిందని ఎవరు కూడా ధర్నాలు, అమరణ దీక్షలు, నిరాహారదీక్షలు, పూజలు చేయాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించిందని పెండింగ్ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో బిల్లు ఇచ్చారని తెలిపారు. వంతెన నిర్మాణంలో భాగంగా గురుకుల్ వైపు అన్ని పిల్లర్లు, శ్లాబుల పనులు పూర్తి చేశారని గేటుకు ఇవతల వైపు పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని మరో మూడు శ్లాబులు వేసే పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. గత 13 సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్న వంతెన పనులు గడిచిన 2 సంవత్సరాలలో వేగవంతం చేయగా 80 శాతం వరకు పూర్తి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఓబిపైకి సంబంధించిన పెండింగ్ బిల్లు రూ.4.18 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. 9 సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని మంత్రి, ఎమ్మెల్యేగా పదవిలో కొనసాగి వంతెన పూర్తి చేయించకుండా ఇప్పుడు పనులు చేసే కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఒక వైపు వంతెన పనులు జరుగుతుండగా కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం యువకులను రెచ్చగొట్టి ఆందోళనలను చేయాలని ప్రోత్సహించే పనులు చేస్తున్నారని ఈవిషయాన్ని యువత గమనించాలని ఆయన హితవు పలికారు. మాజీ ప్రజాప్రతినిధులు గత 15 ఏండ్లుగా పదవుల్లో కొనసాగారని కానీ నీజాయితీగా పని వంతెన పూర్తి చేయించకుండా అడ్డంకులు సృష్టించి ఇప్పుడు సోషల్‌మీడియాలో తామే అంటూ గొప్పలు చెప్పుకోవడాన్ని ప్రజలు నమ్మరని పని చేసి అభివృద్దిని చేసి చూపించే కాంగ్రెస్ ప్రభుత్వం వైపు ఉంటారని ఆయన పేర్కొన్నారు. వంతెన విషయంలో కొందరు ప్రజలను పక్కదారి పట్టించి లేనిపోని అపోహాలు సృష్టించి పేరుకోసం రాజకీయ లబ్ది పొందడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజాఅవసరాలను దశలవారిగా తీర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల పాటు అధికారంలో ఉందని వంతెనను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన పూర్తి చేస్తుందని దీనిపై యువత, గేటు అవతల ప్రజలు, మహిళలు ఆందోళన చెందకూడదని ముత్యాలుయాదవ్ కోరారు.




మాట్లాడుతున్న డిసిసి కార్యదర్శి ముత్యాలుయాదవ్

## కారును అడ్డగించిన ఇద్దరు రిమాండ్

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:** కారును అడ్డగించి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు. సైదాబాద్‌కు చెందిన పోడు సాయికుమార్ ఈనెల 21న సాయంత్రం తన కుటుంబసభ్యులతో కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తన హోండా అమేజ్ కారులో వస్తుండగా రాత్రి 7:30 గంటల సమయంలో మార్గమధ్యలో అవుషాపూర్ వద్దకు రాగానే పల్సర్ ఎన్ఎస్ 160 బైక్ (టిఎస్30కె-3503)పై మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ప్రమాదకరంగా, నిర్లక్ష్యంగా బైక్ నడుపుతూ ఇతరులకు దారి ఇవ్వకుండా వెళ్తుండగా సాయికుమార్ తన కారు హార్న్ కొట్టగా కోప్రోద్రుక్తులైన యువకులు అవుషాపూర్ నుంచి యంనంపేట్ చౌరస్తా వరకు వెంబడించి కారులో ఉన్న కుటుంబసభ్యులను భయబ్రాంతులకు గురి చేసి కారును చేతులతో కొట్టారు.

ఈసంఘటనపై సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. సిసి టివి ఆధారంగా ఇద్దరిని గుర్తించి బుధవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పల్సర్ ఎన్ఎస్ 160 బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిఎపారు.



నిందితులు శివ, అఖిల్

ఈకేసులో భువనగిరి మండలం హన్మాపూర్‌కు చెందిన కారు మెకానిక్ రంగ శివ (21), స్వర్ణగిరి సెక్యూరిటీ గార్డు అరిగె అఖిల్ (20) లను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సిఐ బాలస్వామి తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## వైద్యులకు లయన్స్‌క్లబ్ సన్మానం

**ఘట్‌కేసర్, జూలై 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఘట్‌కేసర్ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ డి.కిరణ్‌కుమార్, డాక్టర్ దార శ్రీనివాస్‌రావు, డాక్టర్ పినిపాటి ప్రసాద్‌లను శాలువా కప్పి సన్మానించారు. రోగుల ప్రాణాలను కాపాడటంతో వైద్యులు అందిస్తున్న సేవలు మరువలేనివని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ సార శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షులు రేసు లక్ష్మారెడ్డి, కార్యదర్శి బచ్చు నగేశ్‌కుమార్‌గుప్తా, కోశాధికారి వేల్పుల రవికుమార్, సభ్యులు జంగయ్య, భోగ శ్రీలక్ష్మి, హరినాథ్, ఉడుత హిమబిందు నవీన్, నాగిళ్ల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.




సిహెచ్‌సిలలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు




## నిబంధనలు ఉల్లంఘిస్తే యజమాన్యాలపై చర్యలు

**అత్తాపూర్ జూలై1 ,ప్రభాతవార్త :** పాఠశాల బస్సులు నడిపేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ సిహెచ్ రాజు పేర్కొన్నారు. ట్రాఫిక్ -111 డిసిపి రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు బుధవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలను ఎస్ఐ, ఎఎస్‌లతో కలిసి ఎస్‌హెచ్‌ఓ రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సు డ్రైవర్లకు లైసెన్సులు, బస్సుల ఫిటనెస్ సర్టిఫికేట్, ఆర్‌సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలను తనిఖీ చేశారు. బస్సుల పార్కింగ్ విద్యార్థులు ఎక్కే, దిగే ప్రదేశాలు పాఠశాల ఆవరణలో ఉన్నాయా లేదని పరిశీలించారు. ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ రాజు మాట్లాడుతూ... నిర్లక్ష్య డ్రైవింగ్‌తో విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఉందని కావున పాఠశాల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బస్సు సీజ్ చేయడంతఓ పాటు నిర్వాహలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## అప్రమత్తతే సైబర్ భద్రతకు మొదటి అడుగు

**అత్తాపూర్ జూలై1 ,ప్రభాతవార్త :** ప్రస్తుతం డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫన్లు, ఇంటర్నెట్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ సిఐ ముత్తు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో ప్రేమావతి పేట్ గ్రామంలోని జై భీమ్ జై రామ్ సంఘంలో ప్రజలకు సైబర్ క్రైమ్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్ మాట్లాడుతూ... సైబర్ నేరాగాళ్లు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు, ఓటిపి , సివివి నెంబర్ వంటివి అడిగితే చెపొద్దని సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేసి డబ్బులు వసూల్ చేస్తారని ,తెలియని లీంకులు క్లిక్ చేయవద్దని అనుమానాస్పద కాల్స్, మేసేజ్ వస్తే వెంటనే స్పందించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అప్రమత్తతే సైబర్ భద్రతకు మొదటి అడుగు అని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ రెడ్డి ,సంఘం అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, ఉపేందర్, లేవి రాజ్, చంద్ర శేకర్, సుమన్, జనార్దన్ ,నాని, అనిల్, రాము, సునీల్, గౌతమ్, నవీన్, రాజు, సుదర్శన్, మహిళలు పాల్గొన్నారు .




## ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**చేవెళ్ల, జూలై 1, ప్రభాతవార్త:** ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుదవారం నిరుపేదలకు ఇండ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం ఇళ్ల స్దలాలను చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయం ముందు దర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ చేవెళ్ల మండల కేంద్రంలోని 75 సర్వే నంబర్‌లో గత నాలుగు సంవత్సరాలుగా గుడిసెలు వెసుకుని జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం ఇళ్ల పట్టాలను అందజేయాలన్నారు. పట్టాలతో పాటు కనీస వసతులైన మంచీనీరు. కరెంట్, రోడ్డు తదితర వసతులను కల్పించాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం అధాకాంరలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్న అర్హులైన వారికి ఇళ్ల స్దలాలను అందించలేదన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని వందలాది మంది పేదలకు గతంలో ఇళ్ల పట్టాలను అందించాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి ఇళ్ల పట్టాలను అందించాలని లేదంటే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, నియోజకవర్గ ఇంచార్జి రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, పాల్మాకుల శ్రీశైలం, సుదీర్, నాయకులు మగ్బుల్, వడ్ల మంజూల, అంజయ్య, బాబురావు, శ్రీను, జలీల్, వెంకయ్య, రఘు, మదు, లలిత, జయమ్మ తదితరులు పాల్గోన్నారు.



చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయం ముందు చేసిన దర్నాలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య

## ఎన్ఆర్ఈజీఎస్‌ను యధావిధిగా కొనసాగించాలి

**దుద్యాల్, జులై 1, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జులై 1 నుండి అమలు చేయనున్న విబిజిరాంజి చట్టాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామీణ పేద ప్రజలకు, కార్మికులకు నష్టం కలిగే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన 4 నూతన లేబర్ కోడ్ లను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, కార్మికుల పక్షాన వామపక్షాలు పోరాడుతాయన్నారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, పాండు, అనంతమ్మ, రాములమ్మ, యాదమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

## డిజిటల్ దస్తూరికి కూకట్‌పల్లి డి.సి

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 1, ప్రభాతవార్త**

పరిపాలన విషయంలో అధికార యంత్రాంగానికి ఏ స్థాయిలో చిత్తశుద్ధి ఉందో మూసాపేట మున్సిపల్ కార్యాలయాన్ని చూస్తే ఇట్టే అవగతం అవుతుంది. ప్రజల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా అనేక రకాలైన విధానాలను అవలంబిస్తూ శీఘ్రగతిన వారి సమస్యల పరిష్కారం చేయాలని ఒకపక్క గుడ్ గవర్నెన్స్ పేరిట ప్రభుత్వం ప్రణాళికలు ప్రవేశపె డుతుంటే ఆచరణలో మాత్రం అవి పూర్తిస్థాయిలో విఫలమ వుతున్నాయి. గతంలో ఒక ఫైల్‌కు సంబంధించి తుది ఉత్తర్వు లు రావాలంటే నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అర్జిదారులు ప్రదక్షి ణలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. కానీ కాల క్రమేణా డిజిటల్ యుగంలో సింగిల్ విండో సిస్టం ద్వారా అనేక రకాలైన నిర్మాణ అనుమతులు గాని, ఇతర సమస్యల పరిష్కా రం గాని జరుగుతూ వస్తుంది. కానీ ఈ మధ్యకాలంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధి కాస్త మూడు మున్సిపాలిటీలుగా రూపాం తరం చెందడం, వాటికిందికి డిప్యూటీ కమిషనర్లు రావడం చక చకా జరిగిపోయాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే మూసాపేట డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో గత పది రోజుల క్రితం నూతన కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయనకు సంబంధించిన డిజిటల్ సిగ్నేచర్ అనుమతులు కూడా సహజం గానే ఉన్నతాధికారులు అప్పజెప్పడం రివాజు. కానీ ఆయన బాధ్యతలు స్వీకరించి దాదాపు పది రోజులు కావస్తున్నా అన్ని విభాగాల డిజిటల్ సిగ్నేచర్ అనుమతులు ఆయనకు లభించిన ప్పటికీ అత్యంత కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగం డిజిటల్ సిగ్నేచర్ బాధ్యతలు నేటికీ ఆయనకు అందుబాటులోకి రాకపోవ డం పలు అనుమానాలకు తావిస్తుంది. నిజానికి ఒక అధికారి సెలవుపై వెళ్ళినా సరే తన కిందిస్థాయి అధికారికి డిజిటల్ సిగ్నేచర్ బాధ్యతలు అప్పజెప్పి వెళ్లడం అధికార యంత్రాంగం లో సహజం. కానీ ఒక డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి బది లీపై వచ్చి పది రోజులు అవుతున్న టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి అతను ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, డిజిటల్ సిగ్నేచర్ చేసే వెసులుబాటు లేకుండా చేయడం వెనుక ఉన్నతా ధికారుల పాత్ర ఏమైనా ఉందా అనే అనుమానాన్ని పలువురు వ్యక్తపరుస్తున్నారు. నిజానికి మున్సిపాలిటీ విభాగం అంటేనే టౌన్ ప్లానింగ్ విభాగం దానికి గుండెకాయ వంటిది.



## అర్హులైన ప్రతి ఓటర్‌కు న్యాయం జరిగేలా చూడాలి

**అత్తాపూర్ జూలై1 ,ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఓటర్ న్యాయం జరిగేలా బి ఎల్ ఓ లు పని చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా బుధవారం గణేష్ నగర్‌లో ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఓటర్‌కు ఎస్ఐఆర్ పత్రాలు పంపిణీ చేయాలని క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు అలాగే ఓటర్లకు కూడా ప్రతి ఒక్కరు ఎస్ఆర్ఐ పారం నింపి దగ్గరలో ఉన్న బిఎల్ఓ కు అందజేయాలని సూచించారు. ఇది చాలా అత్యంత ముఖ్యమైన ప్రక్రియ కాబట్టి ప్రతి ఓటరు విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆయనతో పాటు ఉన్నారు

## ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలి

**అత్తాపూర్ జూలై1 ,ప్రభాతవార్త :**

పేద ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ రాజేంద్రనగర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పుస్తకాల నర్సింగ్ రావు రాష్ట్ర సమితి సభ్యులు, టి రామకృష్ణ. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొని మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో పేదలకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహ్మారెడ్డి ,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ యాదగిరి. రియాజ్ శేర్లింగంపల్లి మండలం కార్యదర్శి కె చందు యాదవ్. శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి. గండిపేట మండల కార్యదర్శి ఎన్. మల్లేష్. జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ భారత జాతీయ మహిళా సమైక్య ప్లి రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కె లక్షి ్మ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయనంద్ గౌడ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు సుధాకర్. తిగిగిది రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాజాత్ఖ్ శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి గిలకరాజు భవన నిర్మాణ కార్మిక సంఘం శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ నాయక్ . జి సత్యం.జె సదానంద గౌడ్ శంకరయ్య కే ఖాసీం. తుపాకుల రాములు ఎస్ కొండలయ్య జెట్టి శ్రీనివాస్ బి నారాయణ గంగారం తదితరులు పాల్గొన్నారు



## పోలీసు పేరుతో దోపిడీ.. నకిలీ కానిస్టేబుల్ అరెస్ట్

**పేట్ బషీరాబాద్, జూలై 1, ప్రభాతవార్త :** పోలీసు కానిస్టేబుల్‌గా నటిస్తూ బాలికల హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని విద్యార్థినులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ పోలీసును పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పకడ్బందీగా నిర్వ హించిన దర్యాప్తులో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నగదు, పోలీసు యూనిఫాం, బొమ్మ తుపాకీ, ద్విచక్రవాహనం తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రలోని మోనిదా శ్రీ గర్ల్స్ హాస్టల్ యజమాని గుడూరు విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్నట్లు, పోలీసు యూనిఫాంలో వచ్చిన ఓ వ్యక్తి అర్ధరాత్రి హాస్టల్‌లోకి ప్రవేశించి విద్యార్థినులపై తప్పుడు కేసులు పెడతానని బెదిరిస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేశాడు. దీనిపై వెంటనే స్పందించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని సేకరించి నిందితుడిని గుర్తించారు. అరెస్టు చేసిన నిందితుడు పండి యాదగిరి అలియాస్ అనిల్ కుమార్ (25)గా పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం అతను ఓ ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, గతంలో మహంకాళి ట్రాఫిక్ పోలీసుల వద్ద రోజువారీ కూలీగా పనిచేసిన నిందితు డు, పోలీసుల విధానాలు గమనించి అదే తరహాలో నేరాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. పోలీసు యూనిఫాం, జాకెట్, నేమ్‌ప్లేట్ సమకూర్చుకుని, పల్సర్ బైక్‌పై తిరుగుతూ పోలీసు కానిస్టేబుల్‌గా నటించేవాడని పోలీసులు తెలిపారు. మొదట దుండిగల్ ప్రాంతంలోని ఓ బాలికల హాస్టల్‌లో ఇదే తరహా మోసానికి పాల్పడిన అతడు, అనంతరం పేట్ బషీరాబా ద్-మేడ్చల్ రహదారిపై ట్రాఫిక్ పోలీసుగా నటిస్తూ వాహనదా రులను ట్రాఫిక్ కేసులు పెడతానని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఇటీవల మోనిదా శ్రీ గర్ల్స్ హాస్టల్‌కు వెళ్లిన నిందితుడు, రాత్రి 10.30 గంటలకల్లా హాస్టల్ మూసివేయాలని యాజమాన్యాన్ని హెచ్చ రించాడు. అనంతరం జూన్ 29 రాత్రి మళ్లీ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులపై వ్యభిచార కేసులు నమోదు చేస్తానని బెదిరించాడు. వారి మొబైల్ ఫోన్లు తీసుకుని ఫొటోలు తీసిన అనంతరం పోలీసు చర్యలు తీసుకోకుండా ఉండాలంటే రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి, చివరకు రూ.2 వేల నగదు బలవంతంగా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితు డి వద్ద నుంచి రూ.2,000 నగదు, పోలీసు యూనిఫాం (ఖాకీ చొక్కా, ప్యాంటు, నేమ్‌ప్లేట్, బెల్ట్, జాకెట్), ఒక రెడ్‌మి స్మార్ట్‌ఫోన్, పల్సర్ మోటార్‌బైక్, ఒక సంచి, బొమ్మ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, మేడ్చల్ ఏసీపీ సి.హెచ్. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ అధికారులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ ఎన్. కోటి రెడ్డి ప్రజలకు కీలక సూచనలు చేశారు. తాము పోలీసులమని చెప్పుకునే వ్యక్తుల గుర్తింపును తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని, ప్రతి పోలీసు అధికారి అధికారిక గుర్తింపు కార్డును కలిగి ఉంటారని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా పోలీసుల పేరుతో వ్యవహరిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా అత్యవసర సేవల నంబర్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయా లని ప్రజలను కోరారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం